క్లుప్తంగా

ప్రపంచానికే పాఠాలు నేర్పిన వ్యవస్థ మనది



ప్రసంగిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రపంచానికే పాఠాలు నేర్పిన వ్యవస్థ మనకు రామాయణ కాలం నాటికే ఉండేదని ప్రవచన విరించి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హిందూ సమాజంలో మూడో రోజు శుక్రవారం ఆయన ఆదర్శ పాలకుడి లక్షణాలు, అయోధ్యా నగర వైభవాన్ని వివరించారు. ఆదర్శవంతమైన రాజనీతి శాస్త్రం, అర్థ శాస్త్రం, గూఢచారి వ్యవస్థ ఎలా ఉండాలి తదితర అంశాలన్నీ నాటి పాలనలో చూడవచ్చనన్నారు. అందుకనే ఒక విదేశీయుడు గ్రంథాలయాలన్నీ తగలబడి పోయినా, రామాయణం ఒక్కటి మిగిలితే చాలని వ్యాఖ్యానించాడన్నారు. దేశాభ్యున్నతి ప్రజల సంపదపై కాదు, సంస్కారంపై ఆధారపడి ఉంటుందన్నారు. దశరథునిలో ఆదర్శ పాలకుని లక్షణాలను చూడవచ్చనన్నారు. కథాపరంగా, అశ్వమేధ యాగం జరిగిన తీరుతెన్నులను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఏసీబీ ఏఎస్పీ సౌజన్య బదిలీ

కంబాలచెరువు: జిల్లా ఏసీబీ ఏఎస్పీగా పనిచేస్తున్న సౌజన్య బదిలీ అయ్యారు. ఈ మేరకు హోంశాఖ నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏఎస్పీల సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె నెల్లూరు జిల్లాలల ఏఎస్పీగా బదిలీ అయ్యారు.

విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న అనంతరావు

రాజమహేంద్రవరం రూరల్: వినియోగదారుల హక్కులను పాఠ్యాంశంలో చేర్చాలని రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు అన్నారు. హుకుంపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం కన్స్యూమర్ వాయిస్ ఆధ్వర్యంలో చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులను తెలుసుకుంటే సమస్యల పరిష్కారం సులభమవుతుందన్నారు. జిల్లాలోని వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి సమస్యకు పరిష్కారం, నష్టపరిహారం పొందవచ్చన్నారు. హెచ్‌ఎం బీఎస్‌వీఎస్ మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమరావాడి రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగిన ధర్నా

సీటీఆర్‌ఐ: ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం రెండో రోజు 36 గంటల మహాధర్నా, వంటా వార్పు కార్యక్రమం కొనసాగింది. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి దేవీచౌక్, గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం, ఆనం కళాకేంద్రం మీదుగా ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నామణి, రాజులోవ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

కడియం: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మండల కేంద్రమైన కడియంలో అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన కొనసాగుతోంది. శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు వారి ఆందోళనకు మద్దతు పలికారు.

తుపాను బాధితులకు ప్రభుత్వ సాయం

సీతానగరం: మిచాంగ్ తుపానుతో కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించి 11 మందికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వ సాయాన్ని ఆయన శుక్రవారం రఘుదేవపురం సచివాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు సాయం అందించడంలో వెనకడుగు వేస్తే, నేడు జగనన్న పాలనలో బాధితులను తక్షణమే ఆదుకునే విధంగా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సింగవరానికి చెందిన బుగ్గ మరియమ్మ, మద్రే ప్రభుదాసు, నిందురు వెంకటలక్ష్మి, రఘుదేవపురానికి చెందిన గంగాధర రమణ, గెద్దా వెంకయ్యమ్మ, నల్గొండకు చెందిన గుత్తి లక్ష్మి, నక్క విక్టోరియమ్మ, చిన్నకొండేపూడికి చెందిన దొంత గొట్టెమ్మ, నన్నపడి బెత్తాయమ్మ, ధర్మపురి నాగేశ్వరరావు, భూపతి సత్యనారాయణ రాజుకు రూ.10 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రలీల, ఉపసర్పంచ్ పట్టపగలు విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

వికసిత్ యాత్ర

రాజానగరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కలిగిస్తూ నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శుక్రవారం కొత్త తుంగపాడులో జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు.

ఆటల్లో అదరహో..

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా
- జాతీయ పోటీలకు ఎంపిక



జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన అదీప్‌ను అభినందిస్తున్న అర్బన్ రేంజ్ డీఐ దిలీప్ కుమార్

ప్రకాశం నగర్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం ఇస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతో పాటు ఆటలకు పెద్దపీట వేసింది. దీంతో విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. నగరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి మైలిపిల్లి సంజయ్ అదీప్ అండర్- 17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 180 కేజీల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచి, జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. అదీప్ తండ్రి మోహనరావు ఆల్కాట్ గార్డెన్స్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నారు. అదీప్ చదువుతో పాటు వెయిట్ లిఫ్టింగ్‌లోను సత్తా చాటుతున్నాడు. త్వరలో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నాడు.

రోప్ స్కిప్పింగ్, కరాటేలో..

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కొలాజియేట్ టోర్నమెంట్ టీమ్ సెలక్షన్ ట్రయల్స్‌లో కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న అండబోయిన యామినిదేవి, మునుని నాగదేవి రోప్ స్కిపింగ్‌లో ఈ ఘనత సాధించారు. బీకామ్ చదువుతున్న పి.శ్రీవిద్యస్వాతి లక్ష్మీదేవి కూడా జాతీయ పోటీలకు ఎంపికైంది. ఆ విద్యార్థినులను ఎస్‌కెవీటీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, ఎస్‌కెకెఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి అభినందించారు.

క్రీడాభివృద్ధికి తోడ్పాటు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేసి, క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఇటీవల స్కూల్ గేమ్స్ నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆడుదాం ఆంధ్ర పేరుతో మరో క్రీడా పోటీలను త్వరలో నిర్వహించబోతుంది. క్రీడాకారులకు సామగ్రిని అందజేయడంతో పాటు అల్పాహారం, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తోంది. దీనిపై పీటీలు, క్రీడా శిక్షకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మంచి భవిష్యత్తు

> చదువుతో పాటు క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తుంది. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంచి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది.
> – దిలీప్ కుమార్, అర్బన్ రేంజ్ డీఐ

డ్రైనేజీల పునర్నిర్మాణానికి చర్యలు

- ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్
- హుకుంపేటలో పర్యటన



హుకుంపేట రజకుల వీధిలో సమస్యలు తెలుసుకుంటున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో రజకుల వీధిలో డ్రైనేజీ శిథిలావస్థకు చేరిందని, దాని స్థానంలో నూతనంగా డ్రైనేజీ నిర్మాణం చేపడతామని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. హుకుంపేట పంచాయతీ పరిధిలోని వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రజకుల వీధిలో డ్రైనేజీ శిథిలం కావడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోందని స్థానికులు తెలిపారు. ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్ హైటెన్షన్ తీగలతో ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొందన్నారు. స్పందించిన నాగేశ్వర్ వెంటనే పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావుకు డ్రైనేజీ నిర్మాణానికి రూ.28 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి హైటెన్షన్ వైర్ల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హుకుంపేట సొసైటీ ఛైర్మన్ బొప్పన సుబ్బారావు, సచివాలయ కన్వీనర్లు వనలపూడి శ్రీనివాస్, చిర్రా గణేష్, కుప్పాల రాంబాబు, పి.శేషాద్రి, గిరజాల శ్రీనివాస్, షేక్ మీరావలీ, షరీఫ్ పాల్గొన్నారు.

మార్గాని ఎస్టేట్స్‌లో ఆధ్యాత్మిక శోభ



యాగ మహోత్సవంలో పాల్గొన్న భరత్ రామ్, మోనా దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో ఎంపీ మార్గాని భరత్ రామ్, మోనా దంపతులు నిర్వహిస్తున్న యాగ మహోత్సవం శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలు హోమాలను రుత్విక్కులు నిర్వహించారు. పండితులు మాట్లాడుతూ ఈ కార్యక్రమాలలో ప్రధానంగా కార్త వీర్యార్జుని అర్చన అత్యంత విశేషమైనదని, మానవునిలో ధైర్యం, పట్టుదల, విశ్వాసాన్ని సమృద్ధిగా కార్త వీర్యార్జుని స్తోత్రంతో సాధించవచ్చునన్నారు. కార్త వీర్యార్జునుడు సాక్షాత్తూ విష్ణుమూర్తి కుడి చేతిలో ఉండే సుదర్శన చక్రం అంశ అని వివరించారు. కోరికలు నెరవేర్చుకునేందుకు కార్త వీర్యార్జునుని స్తోత్ర పఠనంతో ఫలితాన్ని పొందవచ్చునన్నారు. ఇటువంటి అర్చనలు, యాగ హోమాది క్రతువులను నిర్వహిస్తున్న ఎంపీ మార్గాని భరత్ రామ్, ఆయన సతీమణి మోనా దంపతుల జన్మ ధన్యమైందన్నారు. కార్యక్రమంలో ఎంపీ భరత్ రామ్, మోనా దంపతులు, వారి కుమార్తెలు జయాని, శివాన్షి రామ్, తల్లిదండ్రులు మార్గాని నాగేశ్వరరావు, ప్రసూన, సోదరుడు విజయ్ కృష్ణ పాల్గొన్నారు. విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మంజూరైన పనులు తక్షణం చేపట్టాలి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఇప్పటికే మంజూరైన పనులను తక్షణం చేపట్టి పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక 50వ డివిజన్‌లో పార్టీ డివిజన్ ఇన్‌చార్జి గుత్తుల మురళీధర్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. లాలా చెరువు వద్ద వాంబే గృహ సముదాయంలో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన మౌలిక సదుపాయాల సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి అక్కడికక్కడ పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనపై, అందిస్తున్న పథకాలపై ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మానే దొరబాబు, ఒకటో డివిజన్ ఇన్‌చార్జి ముప్పన ప్రభాకర్ చౌదరి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతి తీరని లోటు



ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సభ్యులు

ప్రకాశం నగర్: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్ అన్నారు. సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సాబ్జీ చిత్రపటానికి ఆ పార్టీ సీనియర్ నాయకులు పోలిన వెంకటేశ్వరావు, బి.పవన్ జోహార్లు అర్పించారు. అలాగే ఎమ్మెల్సీ మృతికి వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సభ్యులు సంతాపం తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల అథ్లెటిక్ ట్రాక్‌పై జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం సభ్యులు హాజరయ్యారు.

సాబ్జీకి మృతి బాధాకరం

రాజమహేంద్రవరం రూరల్: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఆకివీడు దగ్గర రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఎం. కోదండరామ్, సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు పి.సతీష్ అన్నారు. వారు మాట్లాడుతూ సైన్స్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన.. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించే స్థాయికి చేరుకున్నారన్నారు. ఎమ్మెల్సీగా ఉపాధ్యాయుల సమస్యలపై, ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలపై కౌన్సిల్లో మాట్లాడారన్నారు.

కంబాలచెరువు: ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతిపై యూటీఎఫ్ శాఖ సంతాపం తెలిపింది. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కందుకూరి విద్యాసంస్థలను ప్రభుత్వపరం చేయడంలో ఎనలేని కృషి చేశారన్నారు.

సమస్యలకు తక్షణమే పరిష్కారం



గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

- ఎంపీ భరత్ రామ్
- ఉత్సాహంగా గుడ్ మార్నింగ్ కార్యక్రమం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని ప్రజా సమస్యలపై అధికారులు బాధ్యతతో వ్యవహరించి, ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు చేపట్టాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక 40వ డివిజన్ సీతంపేట, లక్ష్మీగణపతి గుడి ఏరియా, ఆర్యాపురం, మూలగొయ్యి, చింతాలమ్మ ఘాట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో శుక్రవారం గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వార్డు సమస్యలు, వ్యక్తిగత సమస్యలపై ఆరా తీశారు. వ్యాపారాన్ని అభివృద్ధి చేయాలనుకుంటే బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని చిరు వ్యాపారులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు తెలిపిన పారిశుధ్యం సమస్యలపై చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే డ్రైనేజీల్లో సిల్ట్‌ను తొలగించే పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి వైట్ పర్సన్ దుంగా మంగాలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జి మజ్జి అప్పారావు, ఎంహెచ్‌ఓ వినూత్న, ఏఈ పిల్లి ప్రసాద్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా నరసన్న క్షేత్రం

మధురపూడి: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం కోరుకొండలో స్వామివారి గిరి ప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొబ్బరి కాయకొట్టి, రిబ్బన్ కట్ చేసి గిరి ప్రదక్షిణను ఎమ్మెల్యే రాజా ప్రారంభించారు. స్వామివారి ఉత్సవ మూర్తుల పల్లకీని మోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేశామన్నారు. రూ.40 లక్షల రుడా నిధులతో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ మార్గం నిర్మాణాన్ని పూర్తి చేయడం సంతృప్తికరంగా ఉందన్నారు. స్వామివారి దివ్యాశీసులతో కోరుకొండలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటున్న విషయాన్ని వెల్లడించారు. స్వామివారి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశామని, రూ.90 లక్షలతో కొండపైన రాజగోపురం, రూ.20 లక్షలతో రంగనాథస్వామి ఆలయ పుననిర్మాణాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు: ప్రజల మాన, ప్రాణ, రక్షణే పోలీసుల ధ్యేయమని, దానికి అందరం కలిసి కట్టుగా పనిచేయాలని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. జిల్లా పోలీస్ సిబ్బంది నిర్వహించిన పెరేడ్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్, సివిల్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్, హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కొవడానికి సంసిద్ధంగా ఉండాలన్నారు. సిబ్బందికి ప్రతి శుక్రవారం పెరేడ్ నిర్వహించి అందరికీ అన్ని విభాగాలపై విషయాలలో అవగాహన కల్పించాలన్నారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమన్నారు. ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఎల్.వెంచిరెడ్డి, ఆర్ఐలు యు.శ్రీనివాసరావు, సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎం.రజని, ఎస్ఆర్.రాజశేఖర్‌రాజు, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని వ్యవసాయ కళాశాలలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామరాజ్ నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం బోర్డు మెంబర్ డాక్టర్ కోదండ రామిరెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని కొనియాడారు. జాతీయ సేవాసమితి అధికారి డాక్టర్ జి.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.అనురాధ, డాక్టర్ విజయ కృష్ణకుమార్, డాక్టర్ విజయ శంకర్, డాక్టర్ ఉమా మహేశ్వరి, డాక్టర్ హైమ జ్యోతి పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	యానిమల్
సూర్యమినీ	:	మంగళవారం
సూర్యప్యాలెస్	:	పిండం
స్వామి	:	హాయ్‌నాన్న
శివజ్యోతి	:	జోరుగా హుషారుగా
అనుశ్రీ	:	పిండం
రాజా	:	యానిమల్
అశోక	:	ఎక్స్‌ట్రాఆర్డినరీమేన్
ఊర్వశి	:	కోటబొమ్మాళిపిఎస్
రంభ	:	మంగళవారం
మేనక	:	తికమకతాండ, దళారి
అప్సర నామవరం	:	ఎక్స్‌ట్రా ఆర్డినరీమేన్,యానిమల్
వీఎస్ మహల్ ధవళేశ్వరం	:	హాయ్‌నాన్న
మురళీకృష్ణ కడియం	:	హాయ్‌నాన్న,యానిమల్
వెంకటసూర్య	:	పిండం, యానిమల్

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్



వీరవరంలో బోర్డును ఆవిష్కరిస్తున్న స్టాలిన్ తదితరులు

- వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల ముంగిటకే సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నగరంలో పలు సచివాలయాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 48వ డివిజన్ సంజీవనగర్ పరిధిలో సుమారు రూ. 17 కోట్లు, 13, 14 డివిజన్ల పరిధిలోని కేఎన్ఆర్ పేట సచివాలయం పరిధిలో సుమారు 15.29 కోట్లు, 41వ డివిజన్ శ్రీరామ్ నగర్ సచివాలయం పరిధిలో సుమారు రూ. 11.70 కోట్ల నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయన్నారు. కార్యక్రమాల్లో క్లస్టర్ అధ్యక్షులు అజ్జరపు వాసు, పెంకే సురేష్, మాజీ కార్పొరేటర్లు పోలు విజయలక్ష్మి, మానే దొరబాబు, స్టేట్ ఎస్సీ సెల్ నాయకుడు మార్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి

కడియం: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. మండలంలోని వీరవరంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. స్టాలిన్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలకు ఏ ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ ఫలాలు పారదర్శకంగా అందిస్తున్నారన్నారు. రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, నాయకులు బత్తుల రాము, కొత్తపల్లి రాము, నోడల్ ఆఫీసర్ వి. లజపతిరాయ్ పాల్గొన్నారు.

నవరత్నాలతో నవశకం



కొంతమూరులో మాట్లాడుతున్న విష్ణుమూర్తి

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలతో నవశకానికి నాంది పలికారని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. కోలమూరు సచివాలయం -4లో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అనంతరం గ్రామకూడలిలో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. సచివాలయ కన్వీనర్లు పిన్నమరెడ్డి సూర్యచంద్రం, పరిమి దుర్గారావు, నల్లమిల్లి సుబ్బారావు, వాకపల్లి సుదర్శనరావు, అల్లాడ గణేష్, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉప సర్పంచ్ చెరుకూరి సత్యనారాయణ, ఎంఎం అలీ, బాసు సంజీవరావు పాల్గొన్నారు.